క్లుప్తంగా

పెంచలకోనలో ప్రత్యేక ఏర్పాట్లు


పెంచలకోన క్షేత్రం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో నూతన ఆంగ్ల సంవత్సరం వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాదాల వితరణ తదితర ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సదుపాయం, మధ్యాహ్నం అన్నప్రసాదాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, భక్తులకు నీడ వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నందున అంతరాలయ దర్శనాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు. అలాగే మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

పింఛన్ల పంపిణీ


బిరదవాడలో పింఛన్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

నాయుడుపేట టౌన్: సామాజిక పింఛన్లను మంగళవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అధికారులు, నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల పరిధిలోని బిరదవాడ, పుదూరు, గొట్టిప్రోలు గ్రామాలలో సచివాలయాల వద్ద ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. నూతన సంవత్సరాది సందర్భంగా ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంపీడీఓ సురేష్‌బాబు, పార్థు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుల ఎన్నిక


మండలాధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

కోట: బీజేపీ కోట, వాకాడు మండలాధ్యక్షుల ఎన్నిక కార్యక్రమం మంగళవారం కోటలో నిర్వహించారు. విశ్వనాథం వాసు కోటకు, తూపిలి చంద్రారెడ్డి వాకాడుకు ఆ పార్టీ మండలాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వారిని పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, కోటేశ్వరరావు, కోటారెడ్డి, రమేష్‌బాబు, కిష్టయ్య, బాలాజీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామదేవత వీర్లయ్య స్వామి వార్షికోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వాల్‌పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆవిష్కరించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా చేపట్టే స్వామివారి వార్షికోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వామివారి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమ న్యాయం


జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చిల్లకూరు: సోషలిజంతోనే సమ న్యాయం సాధ్యమని సీపీఐ నాయకులు తెలిపారు. మండలంలోని నెలబల్లి రెట్టపల్లిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామంలో మంగళవారం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925లో డిసెంబర్ నెలలో సీపీఐ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం సమరశీల పోరాటాలు చేసిన ఎంతో మంది నాయకులు పార్టీకి సేవ చేశారని పాత తరం నాయకులను గుర్తు చేసుకున్నారు. నల్లధనం వెలికితీత, పన్నుల భారం తగ్గింపు, నిత్యావసరాల ధరల నియంత్రణ, రెండు కోట్ల ఉద్యోగాల కల్పన తదితరాలపై ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ ప్రభాకర్, షేక్ కాలేషా, గుండాల రమేష్, శశికుమార్, శ్రీనివాసమూర్తి, యశ్వంత్, రఘురామయ్య, తులసి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


చీకవోలు చెరువులోకి నీరు రావడంతో పారుతున్న కలుజు

గ్రామం	ఆయకట్టు
సైదాపురం	- 270 ఎకరాలు
మొలకలపూండ్ల	- 120 ఎకరాలు
గిద్దలూరు మూడు చెరువులు	- 1200 ఎకరాలు
కలిచేడు	- 450 ఎకరాలు
తలుపూరు	- 380 ఎకరాలు
అనంతమడుగు	- 245 ఎకరాలు
రామసాగరం రెండు చెరువులు	- 650 ఎకరాలు
వేములచేడు	- 180 ఎకరాలు
రాజులెరుగుంటపాళెం	- 170 ఎకరాలు
చీకవోలు రెండు చెరువులు	- 350 ఎకరాలు
కొమ్మిపాడు	- 110 ఎకరాలు
తురిమెర్ల	- 50 ఎకరాలు
దేవరవేమూరు	- 246 ఎకరాలు
కమ్మవారిపల్లి	- 150 ఎకరాలు
గంగదేవిపల్లి	- 235 ఎకరాలు

జలం.. పుష్కలం


నాట్లు వేస్తున్న కూలీలు

సైదాపురం: మండలంలోని చెరువులు జల కళ సంతరించుకున్నాయి. వర్షాకాలంలో రైతులకు అవసరమైన నీరు చెరువుల్లోకి వచ్చి చేరడంతో రైతాంగం సంతోషంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. మండల కేంద్రమైన సైదాపురానికి చెందిన మూడు చెరువులు, ఊటుకూరు, తిప్పిరెడ్డిపల్లి, అనంతమడుగు, కలిచేడు, తురిమెర్ల, గిద్దలూరు, చాగణం, కొమ్మిపాడు, చీకవోలు, ఆర్‌వైజీపాళెం తదితర ప్రాంతాల్లోని చెరువులతోపాటు వాగులు, గుంతల్లో కూడా నీరు పుష్కలంగా చేరింది.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

చెరువుల్లోకి నీరు పుష్కలంగా చేరడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. కండలేరు డ్యాం నుంచి తెలుగుగంగ 2ఏ, 2బీ కాలువల కింద నుంచి నేరుగా ఆయా గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేసేవారు. ఈ ఏడాది డ్యామ్‌లో కూడా అపరిమితంగా నీరు నిల్వ ఉంది. చెరువుల్లో నీటి సమస్య వస్తున్న సమయంలో సకాలంలో వర్షాలు కురవడంతో అన్ని చెరువుల్లోకి నీరు వచ్చి చేరింది. దీంతో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కొన్ని చెరువుల కింద ఇప్పటికే నారుమళ్లు పోసి ఉన్నారు. త్వరలోనే యాతలు కూడా మొదలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

సందేహం పోయింది



ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడం లేదనే సందేహం తీరింది. సమీపంలోనే ఉన్న కండలేరు డ్యామ్‌లో కూడా నీరు నిల్వ లేదనే అపోహ ఉండేది. ఈ ఏడాది చెరువుల్లో సమృద్ధిగా నీరు లేకపోవడంతో వరి పంటను పూర్తిగా సాగు చేసేందుకు సందేహంగా ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. దీంతో వ్యవసాయం చేసేందుకు అన్ని గ్రామాల ప్రజలు సన్నద్ధమవుతున్నారు.

- శ్రీనివాసులురాజు, ఏరుగుంటపాళెం , సైదాపురం మండలం

సాగునీటికి కొరతే లేదు



సైదాపురం మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులన్నింటిలోకి సాగునీరు పుష్కలంగా వచ్చి చేరింది. గతంలో సాగు చేసేందుకు నీరు లేక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని రైతులకు కోరాం. కానీ వరుణదేవుడి పుణ్యమా అని మండలంలో వరి సాగు చేసేందుకు ప్రతి గ్రామంలోని చెరువుల్లో నీరు ఉండడంతో రైతులు వరి పంటను సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

- హైమావతి, ఏఓ, సైదాపురం


సైదాపురం చెరువులో చేరిన నీరు


నారు పెరుకుతున్న కూలీలు

నూతన సంవత్సరం వెలుగులు నింపాలి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు నూతన ఏడాది సుఖ సంతోషాలతో ఉండాలని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ప్రజలకు, వెంకటగిరి నియోజకవర్గ ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది అంతా దేవుని అనుగ్రహంతో ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో తులతూగాలని దేవుడిని కోరుతున్నట్లు తెలియజేశారు.

సుఖసంతోషాలతో నూతన సంవత్సరాది


కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్: 2025వ సంవత్సరంలో ప్రజలకు కష్టాలన్నీ తొలగిపోయి సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నూతన సంవత్సర శుభాకాంక్షాలు తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తూ పోరుబాట కొనసాగిస్తున్న మాజీ సీఎం, వైఎస్‌ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలన్నారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం

నాయుడుపేట టౌన్: నూతన సంవత్సర ప్రారంభ వేడుకలను మంగళవారం అర్ధరాత్రి నుంచే కోలాహలంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పలు కూడళ్ల వద్ద భారీ కేకులను కట్ చేసి సంబరాలను వేడుకగా చేపట్టారు. పట్టణంలో గాంధీ పార్కు, అమరగార్డెన్, గరిడీవీధి, రాజగోపాలపురం, దర్గా వీధి, బేరిపేట, సీఎస్ తేజ సెంటర్, బజారువీధి, పాత బస్టాండు తదితర ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి నుండి భారీ కేక్‌లను కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబరాలు చేపట్టారు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు కట్ చేశారు. ఆయన సారధ్యంలో నాయుడుపేట సీఐలు బాబీ, సంగమేశ్వరరావు, ఎస్‌ఐలు పోలీసులతో పహారాగా తిరుగుతూ పర్యవేక్షణ చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

నాయుడుపేట టౌన్: నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని చర్చిల్లోనూ మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శివాలయం, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, చంద్రబాబు కాలనీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, అగ్రహారపేట, బ్రాహ్మణవీధిలోని సాయిబాబా ఆలయాలు, గ్రామ దేవత పోలేరమ్మ, మూకాంబికాదేవి, బేరిపేటలోని మహాలక్ష్మమ్మ, పడమటి వీధిలోని అంకాళమ్మ, రాజ గోపాలపురంలోని సీతా రామాంజనేయస్వామి ఆలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

3న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపు 3వ తేదీ శుక్రవారం లెక్కించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు జరుగుతుందని ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

శ్మశానం రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి


తాళ్వాయిపాడులో గ్రామసభ

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు అరుంధతి కాలనీకి సంబంధించి శ్మశానానికి రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు మంగళవారం రెవెన్యూ గ్రామసభలో తహసీల్దార్ ద్వారకానాథ్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఎంతో కాలంగా శ్మశానం రోడ్డు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలోని గత కొంత కాలంగా నివాస స్థలాలు విషయంలో వివాదాలు జరుగుతున్నాయని, వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరారు. ఆర్ఐ సంతోషినిభాయి, వీఆర్‌ఓలు కళ్యాణి, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి


పొణకా దంపతులను సత్కరిస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

గూడూరు రూరల్: యూనియన్ నాయకులు కలసికట్టుగా పని చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ సూచించారు. గూడూరు ఆర్టీసీ డిపోలోని ఎన్‌ఎంయూ నాయకులు సంస్థ గౌరవ అధ్యక్షుడు పొణకా శివకుమార్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి, దేవసేనమ్మ మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేసే కార్మికులకు ఉన్న సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకునేలా ముందుగా సాగాలని అన్నారు. ఎన్‌ఎంయూ నాయకులు కార్మిక సంఘాలకు ఆదర్శంగా ఉండి ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూనే తమ సమస్యలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు బాషా, జోనల్ చైర్మన్ శ్రీనివాసులు, గౌస్, సందానీ, రఘు, క్రిష్ణ, పోలయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు


పోలీసుల అదుపులో బెల్టు షాపు నిర్వాహకురాలు

వాకాడు: వాకాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో అధికారులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. అందులో భాగంగానే కోట మండలం ఉత్తమనెల్లూరు గ్రామంలో అక్రమ మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న ముంగర లక్ష్మీ అనే మహిళ వద్ద 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందాలి


ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ప్రదర్శన

పెళ్లకూరు: విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య సూచించారు. పెళ్లకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. పాఠశాల స్థాయి నుండి శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం, రవి, శ్రీనివాసరావు, శివానంద, ఖాదర్‌బాషా, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 57.184 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 57.184 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 950, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు తీర్మానం


మున్సిపల్ కార్మికులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల విషయమై కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ షేక్ ఫజులుల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు ముందుగా అజెండాలో రూపొందించిన 48 అంశాల్లో వివిధ అభివృద్ధి పనులను చదివి వాటిపై సమీక్షించారు. నక్కలోళ్లతో సమావేశం జరిపి తరువాత వారికి ఎల్ఐసీ సమీపరలో జీఎన్‌టీ రోడ్డు పక్కన దుకాణాలను ఏర్పాటు చేయాలని కొందరు డిమాండ్ చేశారు. సాధారణ నిధులు రూ.25 లక్షలతో ఏటి పండుగ వేడుకలను జరిపేలా నిధులు కేటాయించడంపై పలువురు కౌన్సిలర్లు ఆక్షేపించారు. వైస్ చైర్మన్‌లు షేక్ రఫీ, వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఏఈ చంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం చైర్ పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ కార్మికులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. చైర్ పర్సన్ కేక్ కట్ చేసి అందరి నూతన సంవత్సర శుభాకాంక్షాలు తెలిపారు.

మురుగు నీటిలో దళితవాడ


మురుగు నీటితో నిండి ఉన్న వీధుల్లో మహిళలు

వాకాడు: వర్షాలు ఆగిపోయి వారం రోజులు గడుస్తున్నా వీధుల్లో చేరిన వర్షపు నీరు ఎటూ కదలక నేటికి మురుగు నీళ్లల్లోనే నడక సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని వాకాడు దళితవాడ ప్రజలు వాపోతున్నారు. ఈ సందర్భంగా దళితవాడ మహిళలు మంగళవారం వీధిలో నిలిచిన వరద నీటిలో నిరసన తెలిపారు. మహిళలు మాట్లాడుతూ ప్రతి సారి చిన్నపాటి వర్షానికే వీధులు జలమయంగా మారుతున్నాయన్నారు. కొద్ది రోజులుగా వీధుల్లోని నీరు మురిగి రోగాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. తమ వీధుల దుస్థితిని ఏ ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి వీధుల్లోని మురుగు నీటిని తొలగించి సీసీ రోడ్డు నిర్మించాలని మహిళలు కోరుతున్నారు.

పోటాపోటీగా క్రికెట్ టోర్నీ


హోరాహోరీగా పోటీ పడుతున్న క్రికెట్ క్రీడాకారులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. అంతర్ పాఠశాలలకు చెందిన క్రికెట్ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి వారికి మంచి అవకాశాలు కల్పించేలా ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొణిదల మునిగిరీష్ తెలిపారు. గత రెండు రోజులుగా జరుగుతున్న పోటీలలో భాగంగా మంగళవారం పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ పాఠశాల, ఆదిశంకర స్కూల్, విందూరు జెడ్పీ హైస్కూల్ జట్లు గెలుపొందాయి. ముందుగా జరిగిన మ్యాచ్‌లో జీవీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 62 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ దిగిన చిల్లకూరు శేషమ్మ స్కూల్ జట్టు 64 పరుగులు చేసి విజయం సాధించింది. అటు తరువాత జరిగిన మ్యాచ్‌లో విందూరు జట్టు, చెన్నూరు జట్టు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన విందూరు జట్టు 10 ఓవర్లలో 92 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చెన్నూరు జట్టు 82 పరుగుల చేసి ఓటమి పాలైంది. అటు తరువాత జరిగిన మ్యాచ్‌లో ఆదిశంకర జట్టు, మినర్వా స్కూల్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఆదిశంకర జట్టు 10 ఓవర్లలో 65 పరుగులు చేసింది. అటు తరువాత బ్యాటింగ్‌కు దిగిన మినర్వా జట్టు 26 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లను రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, జీజీ నాయుడు, కోచ్ లవకుమార్, మహేష్ తదితరులు పర్యవేక్షించారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం


తహసీల్దార్‌కు సూచనలిస్తున్న గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

దక్కిలి: ప్రజలు రెవెన్యూ సదస్సుల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. మండలంలోని దేవునివెల్లంపల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రెవెన్యూ సదస్సుకు 81 ఆర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. వీటిని పరిశీలించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓజిలిలో..


చిలమానుచేనులో వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్ పద్మావతి

ఓజిలి: రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం చేస్తున్నట్లు తహశీల్దార్ పద్మావతి అన్నారు. మండలంలోని చిలమానుచేను, పోలిపాడు, పెదపరియ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను త్వరగిన పరిష్కరించాలన్నారు. రీసర్వేలో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజయ్ కుమార్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, నాయకులు వై.మధుశేఖర్‌రాజు, నాయకులు కె.సుబ్రమణ్యం రాజు, సుధాకర్‌యాదవ్, సర్పంచ్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


జెడ్పీ హైస్కూల్‌లో సైన్స్‌ఫేర్

కోట: జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ మస్తానయ్య ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని ఆయన సూచించారు. వివిధ పాఠశాలల నుంచి బాలబాలికలు హాజరై తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

దక్కిలి: మండలంలోని వెలుగొండలు కింద వెలసియున్న యోగ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జనవరి 1వ తేదీన నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అలంకరణ, భజన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు







ఆయిల్ పామ్ సాగుతో బహుళ ప్రయోజనాలు


అల్లూరుపాడులో ఆయిల్ పామ్ సాగును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

దక్కిలి: రైతులు ఆయిల్ పామ్ తోటలు సాగు చేయడంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని వెంకటగిరి ఉద్యాన శాఖాధికారి ఆనంద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అల్లూరుపాడు, తీర్థంపాడు గ్రామాల్లో పలువురు రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 100 శాతం సబ్సిడీ ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు అందిస్తామన్నారు. ఇప్పటికే వెంకటగిరి సబ్ డివిజన్ దక్కిలి మండలంలోని తీర్థంపాడు, వెంకటగిరి రూరల్ మండలం గొట్లగుంట 30 ఎకరాలు వరకు పంట సాగులో ఉందని తెలిపారు. డ్రిప్ పద్ధతిలో సాగు చేసుకోవడానికి కూడా రాయితీ కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. సాగు చేసిన రైతులు లాభాలు పొందుతుందన్నారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఉద్యానశాఖ అధికారులను, త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

దక్కిలి: గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామాజిక, ఆర్థిక సాంస్కృతిక హక్కులకు సంబంధించినవే మానవ హక్కులని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులపై పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2, జగదీష్, ఏఎస్ఐ శ్రీనివాసులు, ఏపీఓ లక్ష్మీనారాయణ, ఏపీఎం జమునారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ పాల్గొన్నారు.

కలిచేడులోని బ్రాందీ షాపు మూత


షాపును మూయిస్తున్న తహసీల్దార్

సైదాపురం: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బ్రాందీ షాపును మంగళవారం తహసీల్దార్ సమక్షంలో మూసి వేయించారు. సైదాపురం మండలంలోని కలిచేడు గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఓ కంటైనర్‌ను షాపుగా మార్చి అందులో బ్రాందీ షాపు ఏర్పాటు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సైదాపురం తహసీల్దార్ ఈ.రమాదేవి తన సిబ్బందితో కలిసి షాపును మూసివేయించారు.

ఎన్‌బీకేఆర్‌లో క్యాంపస్ సెలక్షన్స్


విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మంగళవారం బెంగళూరుకు చెందిన టాట్ ఎఫ్‌డీ టెక్నాలజీస్ సంస్థ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు 256 మందికి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. వీరిలో 46 మంది కోడింగ్ పరీక్షకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి రమేష్ ఈ సంస్థకు సీఈఓ అన్నారు. తన సంస్థలో ఎన్‌బీకేఆర్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నందుకు ఆయన్ని అభినందించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్, హెచ్ఆర్ సంధాని పాల్గొన్నారు.

సాయిబాబా హుండీ ఆదాయం రూ.2.64 లక్షలు


బాబా హుండీ లెక్కిస్తున్న గ్రామ పెద్దలు

తడ: మండలంలోని తడ కండ్రిగ పంచాయతీ, బీఎల్ పాడు గ్రామంలో వెలసిన శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలోని హుండీని మంగళవారం లెక్కించారు. ఈ లెక్కింపు ద్వారా జూన్ నుంచి డిసెంబర్ వరకు రూ.2.64 లక్షలు సమకూరాయి. స్థానిక నిప్పో పరిశ్రమ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆలయంలో ఏడాదికి రెండు సార్లు హుండీని లెక్కిస్తున్నారు.


తల్లంపాడులో రెవెన్యూ సదస్సు


తల్లంపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

దొరవారిసత్రం: తల్లంపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా భూసమస్యలు, ఇంటి నివేశన స్థలాల కోసం స్థానికులు, రైతుల నుంచి అర్జీలు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సదస్సులో తహశీల్దార్ శైలకుమారి, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, సిబ్బంది పాల్గొన్నారు.







క్యాటిల్ షెడ్‌లు పరిశీలన

కలువాయి: బాలాజీరావుపేటలో రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన క్యాటిల్ షెడ్ల నిర్మాణం పనులను డ్వామా పీడీ గంగాభవానీ మంగళవారం తనిఖీ చేశారు. సబ్సిడీపై నిర్మించుకునేందుకు ప్రభుత్వం రైతులకు షెడ్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో కారణం ఏమిటన్న విషయమై ఆమె రైతులతో మాట్లాడారు. త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆమె వెంట ఈసీ ఉమాదేవి, సిబ్బంది ఉన్నారు.

















శాంతియుతంగా వేడుకలు


అజయ్‌కుమార్, ఎస్‌ఐ

దొరవారిసత్రం: మండల పరిధిలో నూతన సంవత్సరం వేడుకలు ప్రతి ఒక్కరు శాంతియుతంగా నిర్వహించుకోవాలని స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్ కోరారు. వేడుకలు నిర్వహించేవారు అవాంఛనీయ సంఘటలను పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. యువత మద్యం మత్తులో వాహనాలను నడిపితే మాత్రం డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని ఎస్‌ఐ హెచ్చరించారు.

శ్రీచెంగాళమ్మ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు


ప్రత్యేక అలంకరణలో చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం


భక్తులు దర్శనం చేసుకోవడం కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు

సూళ్లూరుపేట: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మీ ఘనంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచే స్వర్ణాభరణ దివ్యశోభిత అలంకారంతో అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుద్దీప కాంతులతో ఆలయం వెలుగులు విరజిమ్ముతోంది. సామాన్య భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్ పరిశీలించారు.

పేదల డాక్టర్


డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి


శ్రీదర్శిని హాస్పిటల్

కోట: కోటలోని శ్రీదర్శిని హాస్పిటల్ మెరుగైన వైద్యసేవలు అందిస్తూ అనతికాలంలోనే ప్రముఖ హాస్పిటల్‌గా గుర్తింపు తెచ్చుకుంది. డాక్టర్ బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి 24 గంటలు వైద్యసేవలు అందిస్తూ పేదల డాక్టర్‌గా అందరి మన్ననలు పొందుతున్నారు. నెల్లూరుకు చెందిన డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి కోటలో శ్రీదర్శిని హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ ప్రాంతంలో చిన్నపిల్లల డాక్టర్ లేని కొరతను తీరుస్తున్నారు. పిల్లల్లో వచ్చే అన్ని రకాల వ్యాధులకు తగిన వైద్యం అందిస్తున్నారు. ఇప్పుడు అన్నీ రకాల వైద్యసేవలకు శ్రీదర్శిని హాస్పిటల్ కేంద్రంగా మారింది. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డితోపాటు డాక్టర్ సునీల్‌కుమార్ అందుబాటులో ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు అత్యవసర చికిత్సలు సైతం తక్కువ ఖర్చుతో లభిస్తుండడంతో పేద, మధ్య తరగతి వర్గాల వారికి శ్రీదర్శిని హాస్పిటల్ ఓ వరంలా మారింది.

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ


హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ

చిల్లకూరు: హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీని గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై చిల్లకూరు సర్కిల్ నుంచి పట్టణంలోని అన్ని మార్గాలలో మంగళవారం నిర్వహించారు. అన్ని పోలీస్‌స్టేషన్‌లకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ మాట్లాడుతూ హెల్మెట్ లేక పోవడంతో ప్రాణాలు కోల్పోయిన వారిని ఎంతో మందిని చూశామన్నారు. బైక్ కొనే సమయంలో హెల్మెట్‌ను వినియోగించేలా తీర్మానం చేసుకోవాలని అన్నారు.

కొత్త ఒరవడి.. సరికొత్త సీఎన్‌జీ బైక్


కొత్తగా వస్తున్న సీఎన్‌జీ మోడల్ బైక్

చిల్లకూరు: వాతావరణ కాలుష్యం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న క్రమంలో వాహనాలను విద్యుత్, గ్యాస్‌తో నడిపేలా ఆయా కంపెనీలు చొరవ చూపుతున్నాయని అనిల్ బజాజ్ షోరూం అధినేత కిలారి సాయి గిరీష్ తెలిపారు. పట్టణంలోని అనిల్ బజాజ్ షోరూంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టేలా బజాజ్ సీఎన్‌జీ వెహికల్‌ను ఆవిష్కరించామన్నారు. బజాజ్ ఫ్రీడం–125 సీసీతో ఈ వెహికల్ పెట్రోల్, సీఎన్‌జీ సిలిండర్‌పై నడిచేలా రూపొందించామన్నారు. ఒక లీటర్ పెట్రోల్‌పై 65 కి.మీ మైలేజీ ఇస్తుందన్నారు. అలాగే ఈ వాహనంలో 2 లీటర్ల పెట్రోల్ ట్యాంకు, 2 కేజీల సీఎన్‌జీ సిలిండర్ ఉంటాయని తెలిపారు. బజాజ్ యాజమాన్యం రెండేళ్లపాటు పలు పరిశోధనలు చేసి ఈ వాహనాన్ని రూపొందించి మార్కెట్‌లోకి విడుదల చేసిందన్నారు. కస్టమర్లు నేరుగా షోరూం వద్దకు వచ్చి వాహనాన్ని తిలకించి త్వరగా బుక్ చేసుకోవాలని కోరారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



కలువాయి: తెలుగురాయపురం, పొదలకూరు సోమశిల రోడ్డు మరమ్మతు పనులు రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రారంభించారు. తెలుగురాయపురం–కలువాయి రోడ్డుకు రూ. 12 లక్షలతో మరమ్మతులు చేస్తుండగా, పొదలకూరు, సోమశిల రోడ్డు కలువాయి సెక్షన్ పరిధిలో రూ.50 లక్షలతో ప్రారంభించారు. ఇటీవలి వర్షాలకు రోడ్లు దారుణంగా దెబ్బతినడంతో వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులు త్వరలో తొలగిపోనున్నాయి. వెంకటరెడ్డిపల్లి సమీపంలో చెరువు కలుజునీరు పారి పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు ప్రాంతంలో పైపుకల్వర్టు ఏర్పాటు చేసి, సిమెంటు రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ అన్వేష్ తెలిపారు.

మహిళపై అత్యాచారయత్నం

తడ: పక్షవాతంతో బాధ పడుతున్న మహిళపై తడ కండ్రిగ, నిప్పో పరిశ్రమ వెనుక నివాసం ఉండే ఎం.కుమార్(22) అనే యువకుడు అత్యాచారయత్నం చేసినట్టు బాధితురాలి బంధువులు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపిన వివరాల మేరకు బాధిత మహిళ(57) 20 సంవత్సరాల క్రితం భర్త నుంచి విడిపోయి తడలోని అక్క ఇంట్లో నివశిస్తోంది. పక్షవాతంతో బాధ పడుతున్న ఈమె పనులకు వెళ్లలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో గత మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమార్ ఇంట్లో ప్రవేశించి అత్యాచారం చేస్తుండగా బాధితురాలి అక్క రావడంతో నిందితుడు పారిపోయాడు. దీనిపై వారం తరువాత పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్ష

కోట: చెక్‌బౌన్స్ కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ కోట జూనియర్ సివిల్‌జడ్జి భరత్‌కమల్ మంగళవారం తీర్పు వెల్లడించారు. కోటకు చెందిన పి.బాలాజీకి ఏడాది జైలుశిక్ష, చెక్ అమౌంట్ రూ.2.50 లక్షలు మొత్తం చెల్లించాల్సిందిగా తీర్పు ఇచ్చారు. అదేవిధంగా వీపీ అగ్రహారానికి చెందిన హేమంత్‌కు చెక్ అమౌంట్ రూ.1.30 లక్షలు చెల్లించడంతో పాటు ఏడాది జైలు శిక్ష విధించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు.

సాంకేతిక అభివృద్ధితో ఖ్యాతి గడించాలి

శ్రీకాళహస్తి: విద్యార్థులు సాంకేతిక అభివృద్ధితో ఖ్యాతి గడించాలని జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్‌ఫెయిర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు విభాగాల్లో మొదటి స్థానం సాధించిన నమూనాలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.



క్యాలెండర్ల ఆవిష్కరణలు


ముత్యాలమ్మ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు


కలవకొండలో క్యాలెండర్ ఆవిష్కరణ

చిల్లకూరు: తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయం, కలవకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌లను మంగళవారం ఆవిష్కరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ముత్యాలమ్మ ఆలయం ఈఓ నవీన్‌కుమార్ క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. అలాగే కలవకొండ గ్రామంలో దేవదాయ శాఖాధికారులతోపాటుగా పాలక మండలి సభ్యులు, మాజీ ఏఎంసీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి క్యాలెండర్లను ఆవిష్కరించారు.

సమాచార పత్రిక విడుదల


పత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు, వైద్యులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల, సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో సమాచార పత్రిక రెండో ఎడిషన్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పేద రోగులకు అందిస్తున్న వైద్యం, పరిశోధనలపై మూడు నెలలుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే వైద్య, పారామెడికల్, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడే సమాచారంతో 3నెలలకు ఒకసారి పత్రికను విడుదల చేస్తున్నట్లు వివరించారు.

రెండేళ్లపాటు పాఠశాల వసతికి వినతి


వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ రేష్మా

తిరుపతి సిటీ: జూపార్క్ రోడ్డులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఎస్వీయూ భవనంలో మరో రెండేళ్లపాటు కొనసాగించుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రిన్సిపల్ రేష్మా విన్నవించారు. మంగళవారం ఈ మేరకు ఆమె పాఠశాల సిబ్బందితో కలసి వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యంలో పాఠశాలకు స్థలం కేటాయించారన్నారు. అయితే నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ భవనంలో పాఠశాల నిర్వహించుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: బైరాగిపట్టెడలోని రెడ్డి సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నేతలు దండు ధర్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జీజీ రెడ్డి, ప్రైవేటు స్కూళ్ల అధినేతలు రెడ్డివారి శ్రీధర్‌రెడ్డి, ఓంప్రకాష్‌రెడ్డి, కాంట్రాక్టర్ ప్రసాద్‌రెడ్డి, బీసీ నేత రెడ్డెప్ప పాల్గొన్నారు.

20న మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి కుమార స్వామి ఆలయం కింద ఉన్న మండపంలో విఘ్నేశ్వరస్వామి మహాకుంభాభిషేకం ఈనెల 20వ తేదీ నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల లోపు ఈ పూజలు జరుగుతాయన్నారు.